క్లుప్తంగా

మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ప్రముఖులు

బీచ్ రోడ్డు: దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా బుధవారం రామ్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వైజాగ్ బ్రాహ్మణ్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏయూ మాజీ రెక్టార్ ప్రసన్నకుమార్ పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, నాయకులు పల్లా దుర్గారావు, సొసైటీ అధ్యక్షుడు కావురు చరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



భాను(ఫైల్)

ఎంవీపీ కాలనీ: మద్దిలపాలెం రామాలయం వీధికి చెందిన మొల్లి భాను ప్రవళిక(20) అదృశ్యంపై ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామాలయం వీధిలో కుటుంబ సభ్యులతో భాను నివాసముంటోంది. అనిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 24న తెల్లవారుజామున భాను ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో భాను తండ్రి శంకరరావు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఎంవీపీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోటి ఎంఎస్ఎంఈల డిజిటలైజేషన్ లక్ష్యం

బీచ్ రోడ్డు: సరళీకృత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ద్వారా అమెజాన్‌లో కోటి చిన్న, మధ్యతరహా వ్యాపార విక్రేతలను 2025 నాటికి డిజిటలైజేషన్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు అమెజాన్ ఇండియా సెల్లింగ్ పార్టనర్ సర్వీసెస్ డైరెక్టర్ అమిత్ నందా తెలిపారు. అమెజాన్‌లో ప్రవేశపెట్టిన నూతన రిజిస్ట్రేషన్ ప్రక్రియ వివరాలను బుధవారం ఆయన విలేకరులకు తెలియజేశారు. త్వరగా తమ వ్యాపారాభివృద్ధిని సాధించేందుకు ఎంఎస్ఎంఈలకు అమెజాన్ మంచి అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. అమెజాన్‌లో 65 శాతం చిన్న, మధ్యతరహా విక్రేతలేనని, వారందర్నీ ఒక చోటకు తీసుకురావడంలో భాగంగా ఈ సరళీకృత రిజిస్ట్రేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

సంపత్ వినాయకుని హుండీల లెక్కింపు

సీతమ్మధార: ఆశీలమెట్టలో కొలువైన సంపత్ వినాయగర్ ఆలయం హుండీలను బుధవారం దేవదాయ శాఖ తనిఖీదారుడు బి.వసంత కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. 25 రోజులకు రూ.17,03,494, 11 గ్రాముల బంగారం, 122 గ్రాముల వెండి, 61 యూఎస్ఏ డాలర్లు, 10 కెనడియన్ డాలర్లు, 1002 ఖతార్ రియాల్, 20 మలేషియా రింగిట్, 30 యెన్‌లు వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ తెలిపారు. శివజ్యోతి, శ్రీ వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు హుండీల లెక్కింపు చేపట్టారు.

మోదీ పాలనపై ప్రచారం



కురుపాం మార్కెట్ ఏరియాలో స్థానికులకు కరపత్రాలు అందజేస్తున్న మేడపాటి రవీంద్ర

జగదాంబ: గృహ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కురుపాం మార్కెట్ ఏరియాలో పర్యటించారు. స్థానికులను కలిసి ప్రధాని నరేంద్ర మోదీ తన తొమ్మిదేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గురించి వివరించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఫిషింగ్ హార్బర్ మండల అధ్యక్షుడు వాసుపల్లి రామారావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత రాజ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పల్లి శ్రీనివాసులు నాయుడు, కొండ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ సజావుగా సాగేలా..



వెంకోజీపాలెం జాతీయ రహదారిపై డివైడర్లను తొలగిస్తున్న సిబ్బంది

మద్దిలపాలెం: వచ్చే నెల 2న జరగనున్న శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి గిరిప్రదక్షిణ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఎంవీపీ కాలనీ నుంచి హెచ్‌బీ కాలనీ వైపు వెళ్లేందుకు వీలుగా వెంకోజీపాలెం జాతీయ రహదారిపై డివైడర్లను తొలగించారు. భక్తుల కోసం ప్రత్యేక మార్గం కల్పించారు. ఎలాంటి తొక్కిసలాట జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

కొనసాగిన నిర్మాణాల తొలగింపు

ఎంవీపీ కాలనీ: గిరిప్రదక్షిణలో భక్తుల నడకకు ఇబ్బందులు లేకుండా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు బుధవారం కూడా కొనసాగింది. ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం ప్రాంతాల్లో జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఫుట్‌పాత్‌లపై ఉన్న నిర్మాణాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో పలువురు టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పోర్ట్స్ ఎరీనా నిర్వహణ ప్రభుత్వమే చేపట్టాలి



ఎరీనా ఎదుట నిరసన తెలుపుతున్న గంగారావు, తదితరులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా నిర్వహణ బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలని సీపీఐఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఎం కార్పొరేటర్ డాక్టర్ గంగారావు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు బుధవారం ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. సహానీ అనే ప్రైవేట్ సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించడాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ జీవీఎంసీ కోట్లు వ్యయంతో నిర్మించిన ఈ ఎరీనా నగరంలోని సామాన్యులకు సైతం అందుబాటులో ఉండాలన్నారు. ప్రైవేట్ సంస్థకు అప్పగించడం ద్వారా భారీగా నిధులు రాబట్టడానికే జీవీఎంసీ చూస్తోందన్నారు. తక్షణమే జీవీఎంసీ తన నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు కుమారి, వెంకటరావు, కొదండ, అప్పారావు, తులసీరాం, నాయుడు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలల అక్రమాలపై ఆర్ఐవోకు ఫిర్యాదు



ఆర్ఐవోకు ఫిర్యాదు అందిస్తున్న శ్రీనివాస్

మద్దిలపాలెం: ప్రైవేట్ జూనియర్ కళాశాలల అక్రమాలను అరికట్టాలని కోరుతూ నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మద్రివేముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పిఠాపురం కాలనీలోని ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవోకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం కింద ప్రతి 100 సీట్లలో 25 సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ఉచితంగా కేటాయించాలని నిబంధన ఉందన్నారు. అయినా పట్టించుకోకుండా ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయన్నారు. ఇరుకు గదుల్లో తరగతులు, సరైన మరుగుదొడ్లు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా కళాశాలలు నడుపుతున్నారని ఆరోపించారు. అంతేకాకుండా కళాశాలల్లో పుస్తకాలు, యూనిఫారం పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా శాఖ అధ్యక్షుడు పెద్దాడ గిరిధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సూర్యం పాల్గొన్నారు.

కనుల పండువగా జగన్నాథుడి బహుదా యాత్ర



జగన్నాథుడి బహుదా యాత్రలో పాల్గొన్న భక్తులు

బీచ్ రోడ్డు: ఉత్కల్ సమాజ్ ఆధ్వర్యంలో బుధవారం జగన్నాథుడి బహుదా శోభాయాత్ర కనుల పండువగా సాగింది. లాసన్స్ బే కాలనీలో ప్రారంభమైన ఈ యాత్ర వుడా పార్కు, చినవాల్తేరు, ఏయూ గేటు, సిరిపురం మీదుగా దసపల్లాహిల్స్‌లోని జగన్నాథస్వామి ఆలయానికి చేరుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. ఈ సందర్భంగా ఉత్కల్ సమాజ్ అధ్యక్షుడు నాయక్ మాట్లాడుతూ 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్రలు తిరిగి తమ ఇంటికి చేరుకున్నారన్నారు.

భర్తను హత్య చేసిన భార్య అరెస్ట్

అల్లిపురం: భర్తను హత్య చేసిన భార్యను మహారాణిపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ప్రకాష్‌రావుపేటలో చిత్తూరు రమణారావు, తన భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు పిల్లలతో కలసి జీవిస్తున్నారు. రమణారావు నిత్యం మద్యం సేవించి.. భార్యను హింసించేవాడు. మూడు రోజుల కిందట రమణారావు భోజనం చేస్తున్న మద్యం మత్తులో భార్యతో గొడవపడి.. ఆమెను చంపేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆమె అందుబాటులోని సెల్ చార్జర్ వైరును అతని మెడకు గట్టిగా చుట్టడంతో రమణారావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అంత్యక్రియలు చేసేందుకు చావులమదుం శ్మశానవాటికకు తీసుకువెళ్లారు. అక్కడ అతని మృతిపై అనుమానం వచ్చిన బంధువులు మహారాణిపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించడంతో విషయం బయట పడింది. దీంతో హత్య కేసుగా నమోదు చేసి విచారణ జరిపారు. నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆశా కార్యకర్తల పాత్ర కీలకం

శిక్షణ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: మాతా, శిశు సంరక్షణ చర్యల్లో ఆశా కార్యకర్తల పాత్ర కీలకమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆశా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాతృ, శిశు మరణాలు సంభవించకుండా మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ప్రతి ఆశా కార్యకర్త గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలోని గృహాలను సందర్శించి కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ మొదలగు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. ఈ ఆశా యాప్‌లో గర్భిణులకు అందించే వాటిని తప్పనిసరిగా నమోదు చేయాలని చెప్పారు. అనంతరం ఆశా కార్యకర్తకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామిరెడ్డి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, అధికారులు మనోరమ, ధర్మేంద్ర, మణికుమారి, స్వర్ణలత, ఎలామా దేవి తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక నిర్మాణం కూల్చివేత



సంతపాలెంలో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించిన అనధికారిక శ్లాబు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో అనధికారిక నిర్మాణాన్ని జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. వివరాలిలా ఉన్నాయి. సంతపాలెంలో ఓ వ్యక్తి రెండు అంతస్తుల నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి అనుమతి తీసుకున్నాడు. అయితే ఇందుకు విరుద్ధంగా రెండు ఫ్లోర్లతో పాటు మరో అంతస్తు నిర్మాణం అనధికారికంగా చేపట్టాడు. విషయం తెలుసుకున్న అధికారులు సిబ్బందితో వెళ్లి ఆ శ్లాబును కూల్చేశారు. అనధికారికంగా వేసిన ఈ శ్లాబును గతంలో ఓ సారి తొలగించారు. ఇప్పుడు మళ్లీ నిర్మాణం చేపట్టడం గమనార్హం. చినగదిలి ప్రాంతంలో పలు అనధికారిక నిర్మాణాలు జరుగుతున్నాయని, సుందరయ్య కాలనీలో కోకో కోలా బిల్డింగ్ సమీపంలో గెడ్డ అంచున మరో అనధికారిక నిర్మాణం చేపడుతున్నట్టు అధికారులు గుర్తించారు. వాటిని కూడా తొలగిస్తామని తెలిపారు.

10వ వార్డులో..

జీవీఎంసీ పదో వార్డు పరిధి ఆదర్శనగర్ ప్రాంతంలో ఓ అనధికారిక నిర్మాణంపై టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. డెయిరీఫారం సమీప ఆదర్శనగర్ ఒకటో లైన్ ఎదురుగా ప్రధాన రహదారిని ఆనుకొని ఓ వ్యక్తి అనధికారికంగా ఐదో ఫ్లోర్ నిర్మాణం చేపట్టాడు. టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బందితో వెళ్లి అనధికారిక అంతస్తును తొలగించారు. మళ్లీ నిర్మాణం చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గెడ్డల్లో పూడిక తొలగింపు



శ్రీకాంత్‌నగర్ గెడ్డలో పూడిక తొలగించిన దృశ్యం

ఆరిలోవ: జీవీఎంసీ అధికారులు ఆరిలోవ పరిసరాల్లో గెడ్డలను శుభ్రం చేయిస్తున్నారు. వర్షా కాలం కావడంతో గెడ్డల్లో వరద నీరు కిందకు పోవడానికి ఆటంకం లేకుండా చర్యలు చేపడుతున్నారు. బాలాజీనగర్, గాంధీనగర్ గెడ్డలను ఇప్పటికే ఆధునీకరించారు. తాజాగా పార్వతీనగర్ గెడ్డ, ముడసర్లోవ రిజర్వాయర్ నుంచి శ్రీకాంత్‌నగర్, పెదగదిలి, హనుమంతవాక, ఎంవీపీకాలనీ మీదుగా సముద్రంలో కలిసే పెద్ద గెడ్డ, కంబాలకొండ వెనక భాగం నుంచి దుర్గాబజార్ మీదుగా శ్రీకాంత్‌నగర్ వరకు ఉన్న గెడ్డల్లో పూడిక తీత పనులు చేపట్టారు. పొక్లెయిన్‌తో పూడిక, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. ఇప్పటి నుంచైనా గెడ్డల్లో చెత్త వేయొద్దని అధికారులు స్థానికులకు సూచిస్తున్నారు. చెత్త వేయడం వల్లే పూడిక పేరుకుపోతుందని, తరచూ శుభ్రం చేయడానికి అధిక నిధులు వెచ్చించాల్సి వస్తోందని చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌కు ముడిసరకు అందిస్తే మరిన్ని అద్భుతాలు

బీచ్ రోడ్డు: స్టీల్ ప్లాంట్‌కు జాతీయ అవార్డు రావడంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ హర్షం వ్యక్తం చేశారు. కూర్మన్నపాలెంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్వహిస్తున్న దీక్షలో ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వేణుమాధవ్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ముడిసరకు అందిస్తే మరిన్ని అద్భుతాలను కార్మికులు చేసి చూపిస్తారన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్)తెలిపారు. డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్, ముత్తూట్ ఫైనాన్స్ కార్ప్, హెటిరో డ్రగ్స్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, డక్కన్ ఫైన్ కెమికల్స్, పేటీఎం, సువర్ణభూమి డెవలపర్స్, అపోలో ఫార్మసీ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థల్లో 375 ఖాళీల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఎస్ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించి 18–27 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు https://www.ncs.gov.in/లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే జాబ్ మేళాకు హాజరుకావాలని వారు కోరారు.

శిశుగృహ, ఐసీడీఎస్ కార్యాలయాల సందర్శన

మద్రిపాలెం: ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద ఉన్న శిశుగృహ, ఐసీడీఎస్ కార్యాలయాన్ని బుధవారం ఆర్‌జేడీ చిన్మయిదేవి, పీడీ వెంకటేశ్వరి సందర్శించారు. శిశుగృహలో పలు దస్త్రాలను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఐసీడీఎస్ కార్యాలయంలో ఇటీవలే నూతనంగా ఏర్పడిన సెక్టార్ విధివిధానాలను వారు అడిగి తెలుసుకున్నారు. అధికారుల వెంట అడిషనల్ సీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్లు కుమారి, వెనిష తదితరులు ఉన్నారు.

ఏయూ సమాచారం...

ఘనంగా విక్రమ్‌దేవ్‌వర్మ జయంతి



విక్రమ్‌దేవ్‌వర్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్, తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జైపూర్ మహారాజ విక్రమ్‌దేవ్ వర్మ 154వ జయంతిని ఘనంగా నిర్వహించారు. భౌతికశాస్త్ర విభాగం వద్ద నున్న విక్రమ్‌దేవ్‌వర్మ విగ్రహానికి రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కళింగ ఒడియా అకాడమీ అధ్యక్షుడు జె.కె.నాయక్, సురేంద్ర బెహరా, మయాంక్ కుమారి డియో, లతికా డియో, హైకోర్టు న్యాయవాది జ్ఞాను వివేక్ కర్రా, సుమిలా వివేక్ కర్రా, వెంటేష్ కందుల, గిరిధర్, రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు జగపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. సూక్ష్మప్లాస్టిక్-విశ్లేషణ, నియంత్రణ, నిర్వహణ అంశంపై నిర్వహించిన మూడు రోజల శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసిన పరిశోధకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను రిజిస్ట్రార్ వివరించారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఆర్.మాధవి, సదస్సు కన్వీనర్ ఆచార్య పి.జానకీరామ్, గౌరవ ఆచార్యులు డాక్టర్ కె.ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ సమాజం అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ప్రేమ సమాజం అధ్యక్షుడు శివాజీ

దాబాగార్డెన్స్: ప్రేమ సమాజం అభివృద్ధికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు బుద్ద శివాజీ పేర్కొన్నారు. ప్రేమసమాజం నూతన కమిటీ బుధవారం ప్రేమసమాజంలో పదవీ బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా బుద్ద శివాజీ మాట్లాడుతూ ప్రేమ సమాజం ఉపాధ్యక్షుడిగా సేవలందించానని, ఇప్పుడు ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షునిగా మట్టపల్లి హనుమంతరావు, కేశప్రగడ నరసింహమూర్తి, గౌరవ కార్యదర్శిగా కె.హరిమోహనరావు, గౌరవ కోశాధికారిగా ఎంవీవీకే గుప్తా, సంయుక్త కార్యదర్శులుగా వి.మోహన్‌రావు, వి.కె.సురేష్ కుమార్, ఎస్.గౌరీ ప్రసాదరావు పలువురు సభ్యులచే ప్రముఖ వైద్యుడు విశ్వేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించి, నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రేమసమాజం పూర్వ అధ్యక్షుడు కంచర్ల రామబ్రహ్మం, వేగి సత్యనారాయణ పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో సత్తా

ఎంవీపీ కాలనీ: రైఫిల్ షూటింగ్‌లో ఎంవీపీ కాలనీలోని భారత్ షూటింగ్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. హైదరాబాద్ వేదికగా జరిగిన 23వ స్టేట్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో పలు పతకాలు సాధించినట్టు అకాడమీ కార్యాలయ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మహిళల షూటింగ్‌లో అరుణిత కాంస్యం పతకం సాధించింది. వైష్ణవి శియాద్రి 25 మీటర్ల పోటీల్లో బంగారం, లోహిత్ శియాద్రి 25 మీటర్ల పురుషుల పోటీల్లో వెండి, 10 మీటర్ల పోటీల్లో కాంస్యం, వాసుపల్లి సుశాంత్ 10 మీటర్ల పోటీలో వెండి పతకం సాధించాడు. వచ్చేనెల 9న విజయవాడలో జరగనున్న ముగింపు కార్యక్రమంలో ఆయా పతకాలను క్రీడాకారులు అందుకోనున్నారు. ఈ సందర్భంగా విజేతలకు సంస్థ కోచ్‌లు మోహన్, గణేష్ అభినందనలు తెలిపారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎంవీపీ కాలనీ: ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని ఎంవీపీ కాలనీ సెక్టార్-6, భద్రం పార్కు, డీఆర్‌డీఏ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. సెక్టార్-6 11కేవీ ఫీడర్ నిర్వహణ సర్వీసుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.



గోల్డెన్ పెండ కనువిందు

అరుదైన గోల్డెన్ పెండ పుష్పించి కనువిందు చేస్తోంది. పసుపు పచ్చని పుష్పాలతో కనిపించే ఈ మొక్కలు ఆస్ట్రేలియాలో అధికంగా కనిపిస్తాయి. వీటిని ఫస్ట్ లవ్ అని కూడా పిలుస్తారు. మైర్టేసి బాటిల్ బ్రష్ ఫ్యామిలీకి చెందిన ఈ మొక్కలు రాణిచంద్రమణిదేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న జీవ వైవిధ్య ఉద్యానవనంలో ఉన్నాయి.

– ఏయూ క్యాంపస్